క్లుప్తంగా

ఆకుకూరలు తప్పకుండా తీసుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు చిరుధాన్యాలు, ఆకుకూరలను తీసుకోవడం ద్వారా రక్తహీనత రాకుండా చూసుకోవచ్చని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాస విఠల్‌రావు సహకారంతో ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు రక్తహీనత ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. విద్యార్థులు జంక్‌ఫుడ్‌ను తగ్గించి మంచి పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రమేష్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.1.5 లక్షల విరాళం



మధురానగర్(విజయవాడసెంట్రల్): 16 సంవత్సరాలుగా వృద్ధుల సంక్షేమానికి కృషిచేస్తున్న వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్‌కు సోమవారం విజయ్ నర్సింగ్ సంస్థల అధినేత తట్టి అర్జునరావు రూ.1.5లక్షల విరాళాన్ని ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లాహరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలకు తమవంతు బాధ్యతగా విశాఖపట్నం విజయ్‌కృష్ణ కాలేజీ ఆఫ్ నర్సింగ్ కళాశాల నుంచి రూ. 75వేలు, విజయవాడ విజయ్ నర్సింగ్ కళాశాల నుంచి రూ.75వేలు మొత్తం రూ. రూ.1.5లక్షలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టీలు నీలు సతీష్, కె.మధుసూదనరావు, ఎస్ఎన్ వరప్రసాద్, పీ లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్‌టుగెదర్-2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు పాత, కొత్త దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇంట్లో వాడకుండా వదలివేసిన పాత దుస్తులను సేకరించి వాటితో పాటు కొన్ని కొత్త దుస్తులను కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక, రహీమా, సురేష్ పాల్గొన్నారు.

అక్కసుతోనే ఆరోపణలు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎంతటి నీచానికైనా పాల్పడి అధికారాన్ని రాబట్టుకోవాలనే అక్కసుతోనే మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా, టీడీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి మల్లెల చెన్నకేశవరెడ్డి, 57వ డివిజన్ అధ్యక్షుడు ఇసరపు రాజు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ కాళ్ల ఆదినారాయణ ఆరోపించారు. ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో అవినీతి జరుగుతుందని టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలను 57వ డివిజన్‌లోని పురుగుల ఆంజనేయస్వామి సాక్షిగా నిరూపించాలని వైఎస్సార్ సీపీ నాయకులు చేసిన సవాల్‌కు టీడీపీ నాయకులు వెనుకడుగు వేశారు. సోమవారం మధ్యాహ్నం వరకూ ఆలయం వద్దే వైఎస్సార్ సీపీ నాయకులు ఎదురు చూసినా ఒక్క టీడీపీ నాయకుడు కూడా రాలేదు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మీడియాతో మాట్లాడుతూ పేదలకు మేలు జరుగుతుందంటే టీడీపీ నాయకులు చూసి ఓర్వలేకపోతున్నారని, అవినీతి రహిత పాలనను జగనన్న ప్రభుత్వం అందిస్తుంటే అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా గతంలో పనిచేసిన మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా, ఎరుబోతు రమణారావులు ఎమ్మెల్యే మల్లాది విష్ణుపై, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురదజల్లాలని ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, పఠాన్ నజీర్‌ఖాన్, ప్రేమ్, గొలగాని శ్రీనివాస్, చిన్నా, కొఠారి ఉత్తమ్, సత్యశ్రీనివాస్‌రెడ్డి, ఆలీభాయి పాల్గొన్నారు.

పెద్దన్నయ్యలా జగనన్న తోడుంటున్నాడు

ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పేద ఆడపిల్లలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దన్నయ్యలా తోడుంటున్నాడని, వారి పెళ్లిళ్ల సమయంలో వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించడం సంతోషంగా ఉందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నగదును జమ చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలో సోమవారం క్షీరాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవారి ఇళ్లల్లో పిల్లల పెళ్లిళ్లు అంటేనే బహు భారంగా బాధపడుతుంటారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్పయాత్రలో పేదల కష్టాలను ప్రత్యక్షంగా వీక్షించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల పిల్లల పెళ్లిళ్ల సమయంలో లక్ష నుంచి లక్షన్నర వరకూ ఆర్థిక సాయాన్ని అందించడం గొప్ప విషయమన్నారు. పేదల పెన్నిధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. పేదల కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక్క అడుగు ముందుకు వేస్తే మన జగనన్న చెప్పినట్లుగా ఆయన కంటే మరో రెండడుగులు ముందుకు వేసి పేదల కుటుంబాల్లో సంతోషాలను నింపుతున్నారన్నారు. ముందుగా డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, మైనార్టీ నాయకులతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు అక్బర్, అఫ్రోజ్, నజీర్, రఫీ, అన్సారీబేగ్, ఎస్‌కే బాబు, కరీముల్లా, ఎస్‌కే రఫీ, ఇస్మాయేల్, అలీ, నాగుల్‌మీరా, ఫాతిమా, చాందిని పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి తోడ్పాటు అభినందనీయం

సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మహిళలకు తోపుడుబళ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): పేద మహిళలు చిరు వ్యాపారాలు నిర్వహించుకుని స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన తోపుడుబళ్లను కార్పొరేటర్ అందజేయడం అభినందనీయమని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గిరిపురానికి చెందిన కంభంపాటి సావిత్రి, సరోజ, కస్తూరిబాయిపేటకు చెందిన మాదాసి కోటేశ్వరి చిరువ్యాపారాలను నిర్వహించుకునేందుకు అవసరమైన తోపుడుబళ్లను 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత సమకూర్చారు. వాటిని సోమవారం సీతారామపురంలోని తన కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మల్లాది విష్ణుచేతుల మీదగా మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేటర్లు ప్రజా ప్రతినిధులుగా ప్రజల అవసరాలు తీరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుక్కల అనిత, నాయకులు కుక్కల రమేష్, కొమ్ము చంటి, ఒబిరెడ్డి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ



ప్రదర్శనలో ఉంచిన కూరగాయలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారి విజయభారతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన అధికారులను, స్పందనకు వచ్చే ప్రజలను ఆకర్షిస్తోంది. వీటికి గిరాకీ అంతేస్థాయిలో ఉంది. స్పందనకు వచ్చిన అధికారులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం రోజు కలెక్టర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఆ రోజు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల ఉత్పత్తులతో డీఏఓ, డీపీఎం ఆధ్వర్యాన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు (ఆపిల్‌బేర్ - జామ) పప్పులు, నూనెలు, బెల్లం, రైతు బుట్ట (నెలకి అవసరమగు ఉత్పత్తులు)లను కొనుగోలు చేశారు.రైతులను జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎం. విజయభారతి, తదితరులు అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్) : పేదలకు అందుతున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధిని చూసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. 58వ డివిజన్ 258వ వార్డ్ సచివాలయం పరిధిలో నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి సోమవారం ఆయన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. 223 గడపలను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూజీడీ, శానిటరీ, వీధి కుక్కల సమస్యలను ప్రజలు అధికంగా చెప్పడంతో వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి అక్కడికక్కడే ప్రత్యేక చర్యలు చేపట్టారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన సీఎం జగనన్న ఇంటి వద్దకే ప్రభుత్వ పాలనను, ప్రభుత్వ సేవలను తీసుకొచ్చారని, దీనిపై ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

టీడీపీ హయంలో అవినీతి విలయతాండవం

గత టీడీపీ ప్రభుత్వ హయంలో సెంట్రల్ నియోజకవర్గంలో అవినీతి విలయతాండం చేసిందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని పేదలను ఇష్టానుసారంగా ఆ పార్టీ నాయకులు దోచుకున్నారని ఆరోపించారు. ముఖ్యంగా ఇళ్ల రిజిస్ట్రేషన్ల పేరుతో కాయకష్టం చేసుకునే పేదల కష్టార్జితాన్ని కూడా మాయమాటలతో లాక్కున్నారని దుయ్యబట్టారు. పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్‌పై సీఎం జగనన్న తీసుకున్న నిర్ణయంతో 25 వేల మంది పేద కుటుంబాలకు మేలు చేకూరుతుందని, అభ్యంతరం లేని ఆక్రమిత భూముల్లో 150 గజాల లోపు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయాలని రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందన్నారు. స్థానిక కార్పొరేటర్, ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం అన్ని తమ చేతుల్లో ఉన్నప్పటికీ ఆరోజు వీటిని అమలుచేయకపోగా నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేయిస్తుంటే దాన్ని చూసి ఓర్వలేక పచ్చ మీడియాతో టీడీపీ నాయకులు ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. మాట్లాడేటప్పుడు టీడీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకపోతే ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సివస్తుందని హెచ్చరించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దశాబ్దాలుగా సింగ్‌నగర్ పరిసర ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న చెత్త డంపింగ్ యార్డ్ సమస్యకు, ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న చిన్న సమస్యలను కూడా సత్వరమే పరిష్కరించే మార్గం లభిస్తుందన్నారు. కార్పొరేషన్ సీడీఓ జగదీశ్వరీ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, ఏఈ అరుణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, క్రాంతి, శ్యామ్‌కుమార్, శర్మ, తోపుల వరలక్ష్మీ, బొందిలి శైలజా పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఇంద్రకీలాద్రి ముస్తాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయంతో పాటు మల్లేశ్వరాలయం, మహా మండపం, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం విద్యుత్‌దీపాలను వెలగించి పరిశీలించారు. ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన మహా శివుని ప్రతిరూపం నగరంలోని పలు ప్రాంతాల నుంచి దర్శనమిస్తుంది. మహా శివరాత్రి రోజున మల్లేశ్వర స్వామి దర్శనానికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.





18న విక్టరీమీట్ - 2023

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షలు చక్కగా రాసి ఉన్నత మార్కులు సాధించేందుకు ఈ నెల 18వ తేదీన మధురానగర్ నిత్యసువార్త సహవాసంలో విక్టరీ మీట్-2023 నిర్వహించనున్నట్లు సహవాసం అధ్యక్షుడు పలిశెట్టి మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ మీట్ జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాస్టర్ రవికుమార్ పలిశెట్టి హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులకు పరీక్షల సమయంలో తోడ్పడే చిట్కాలు నేర్పించడంతో పాటు విద్యార్థులను సన్మార్గంలో నడిపించే గానాలు, నాటికలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. శక్తివంతమైన ప్రార్థనలు, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన దృశ్య మాధ్యమ ప్రదర్శనలతో విక్టరీ-2023 మీటింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



ఆర్థిక సాయం, బీమా పత్రాలు అందజేస్తున్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆపద సమయంలో పేదలకు వైఎస్సార్ బీమా పథకం ఒక అండగా నిలుస్తుందని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ పేర్కొన్నారు. 58వ డివిజన్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన కాడం నాగేశ్వరరావు(55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి వారికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా ఆర్థిక సాయం అందించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ చేతులమీదుగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

విద్యార్థులు పఠనాశక్తి కలిగి ఉండాలి

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు నిరంతరం పఠనాశక్తి కలిగి ఉండాలని, పుస్తక పఠనంపై అందరికీ అవగాహన కలిగించాలని స్టెల్లా కళాశాల ఇంటర్మీడియట్ విభాగం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రామకృష్ణ పేర్కొన్నారు. కళాశాల నుంచి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో జరుగుతున్న పుస్తక మహోత్సవానికి సోమవారం ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తకాలను చదవటం అలవర్చుకోవాలన్నారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానంతోపాటు మానసిక ఉల్లాసం కూడా పెరుగుతుందన్నారు. కరెంట్ ఎఫైర్స్, సైన్స్, చరిత్ర, రాజకీయాల అంశాలు పొందుపరచిన పలు రకాల పుస్తకాలు ఈ ప్రదర్శనలో లభిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇంటర్మీడియట్ కో-ఆర్డినేటర్లు గ్రేస్ యూనిస్, స్వప్న వున్నం పాల్గొన్నారు.

ఎయిమ్స్‌కు బస్సు నడపాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్‌నుంచి సాంబమూర్తి రోడ్డు మీదుగా మంగళగిరి ఎయిమ్స్‌కు సిటీ బస్సు నడిపాలని సోమవారం స్పందనలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్ స్థానికులతో కలిసి విజ్ఞప్తి చేశారు. గతంలో తాము స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిమ్స్‌కు సిటీ బస్సు ఏర్పాటు చేశారని, తరువాత దేవీనగర్‌లో రోడ్డు బాగాలేదని బస్సు సర్వీసు నిలిపివేశారని పేర్కొన్నారు. ఇప్పుడు రోడ్డు బాగానే ఉండటంతో సర్వీసు పునరుద్ధరించాలని కోరారు. సొసైటీ కార్యదర్శి కె.రాము, కోశాధికారి జీ ఏడుకొండలు పాల్గొన్నారు.

భారతదేశ సాంస్కృతిక చరిత్ర తరగని గని



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శేషగిరిరావు, భరత్ జీ, డాక్టర్ సాంబశివరావు

విజయవాడ కల్చరల్: భారతదేశ సాంస్కృతిక చరిత్ర తరగని గని అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు పేరాల శేఖరరావు అన్నారు. సమాలోచన ఆధ్వర్యంలో సెంట్రల్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఆచార్య ఎస్‌వీ శేషగిరిరావు రచించిన సంక్షిప్త భారతదేశ చరిత్ర-సంస్కృతి ఆవిష్కరణ కార్యక్రమం మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాలోని సెమినార్ హాల్లో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భారతదేశ చారిత్రక వైభవాన్ని నేటి తరం అధ్యయనం చేయాల్సిన అవసముందన్నారు. భారతదేశం వేదభూమి, కర్మ భూమి, సంస్కృతి సంప్రదాయాలకు నిలయం అని తెలిపారు. భారత దేశ ఔన్నత్యాన్ని కాపాడుతున్నది వేద సంస్కృతిసేన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సహ ప్రచారక్ ఎస్. భరత్‌కుమార్ మాట్లాడుతూ చరిత్రను పరిశీలించి, వాటిని అక్షర రూపం కలిగించి భావి తరాలకు అందించిన రచయిత కృషిని అభినందించారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు పుస్తక సమీక్ష చేశారు. సమాలోచన బాధ్యులు త్రినాథ్, అంజయ్య, బాజీ, న్యాయవాది హరనాథ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మందులు క్రమం తప్పకుండా వాడడంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఇండియన్ మెడిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 200 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. నిక్షయ మిత్ర కార్యక్రమంలో 200 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ద్వారా పోషకాహార కిట్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు వేల మందికి పైగా క్షయ వ్యాధితో బాధపడుతున్నారని, వారందరికీ పౌష్టికాహార కిట్లను అందించి, రోగ నిరోధక శక్తిని పెంచే విధంగా ఆరు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తగ్గకుండా పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా క్షయ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులను అశ్రద్ధ చేయకుండా వాడుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలకు తోడు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ప్రాణాంతకమైన అంటువ్యాధి అయిన క్షయ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందన్నారు. పౌష్టికాహారన్ని తీసుకుని వ్యాధిగ్రస్తులు త్వరితగతిన కోలుకుని ఆరోగ్యవంతులు కావాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమకూర్చిన 16 డిజిటల్ హిమోగ్లోబిన్ ఎనలైజర్లను వార్డు హెల్త్ సెక్రటరీలకు కలెక్టర్ ఢిల్లీరావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం అందజేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రెహమాన్, కార్యదర్శి డాక్టర్ మనోజ్, జిల్లా టీబీ కంట్రోలింగ్ అధికారి డాక్టర్ ఉషారాణి పాల్గొన్నారు.

17 నుంచి వీఎంసీ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్



స్పోర్ట్‌మీట్ జట్లను లాటరీ ద్వారా ఎంపిక చేస్తున్న వీఎంపీ మేయర్ రాయన భాగ్యలక్ష్మీ

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులకు ఈ నెల 17 నుంచి 19 వరకు వీఎంసీ స్పోర్ట్స్ మీట్ - 2023 నిర్వహిస్తున్నమని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూంలో అధికారులతో కలసి లాటరీ విధానంలో జట్లను ఎంపిక చేశారు. ఇందులో మొత్తం 10 జట్లు పాల్గొంటున్నాయని, వాటిలో మేయర్ జట్టు, కమిషనర్, మున్సిపల్ రెవెన్యూ, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్, యు.సి.డి, ఎడ్యుకేషన్, రెవెన్యూ (వి.ఆర్.ఒ), మహిళా పోలీస్ జట్లు పాల్గొంటున్నాయని ఆమె అన్నారు. ఆయా జట్లకు 100 మరియు 400 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, 400 మీటర్ల నడక, షార్ట్ పుట్, షటిల్ బ్యాట్‌మెంట్, క్రికెట్, వాలీబాల్, కబాడీ, టెన్నిస్, చెస్, త్రో బాల్, టెన్నీ కాయిట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డి.ఎఫ్.ఒ శ్రీనివాస్, అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర రావు, సిటి ప్లానర్ జీ.వి.జీ.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ సిటీప్లానర్ (ప్లానింగ్) జుబిన్ శిరస్ రాయ్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏపీకి చేసిన ద్రోహంపై బీజేపీ లెంపలేసుకోవాలి

ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పర్యటించి, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు ముందుగా బీజేపీ ప్రభుత్వం ఏపీకి చేసిన ద్రోహంపై లెంపలేసుకోవాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఐదేళ్లు కాదు పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ సాక్షిగా చెప్పిన బీజేపీ ప్రభుత్వం ఆ మాటను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర సహాయ మంత్రి దేవుసిన్హా యాహాన్‌కు కనీసం ఏపీ రూపురేఖలు, నైసర్గిక స్వరూపం గురించి కూడా తెలియని వ్యక్తి అని చివరకు ఆయన కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. విభజన చట్టం లోని అంశాలను ఎందుకు అమలుచేయడం లేదు, పోలవరం ప్రాజెక్టుకు సకాలంలో నిధులు ఎందుకు ఇవ్వడం లేదు, ఆంధ్రుల హక్కైన విశాఖ ఉక్కును ఎందుకు ప్రైవేటీకరిస్తున్నారో కేంద్రమంత్రి చౌహాన్, బీజేపీ నాయకులు సత్యకుమార్, జీవీఎల్ నరసింహారావులు సమాధానం చెప్పాలని నిలదీశారు. యావత్ దేశానికి ఆదర్శ పాలనను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఓ వైపు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇస్తుంటే మరో వైపు ఆ ప్రభుత్వ మంత్రులు, నాయకులు ఇలా నిస్సిగ్గుగా విమర్శలు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సత్యకుమార్ చెప్పేవన్నీ అసత్యాలే అని, జీవీఎల్‌కు కనీస జ్ఞానం కూడా లేదని ఇకనైనా బీజేపీ నాయకులు వ్యక్తిగత అజెండాతో పనిచేయడం మానుకోవాలని లేకపోతే ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక సరోజినీనాయుడు



ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్

లబ్బీపేట(విజయవాడతూర్పు): భారత కోకిలగా ప్రసిద్ధిగాంచిన సరోజినీనాయుడు మహిళా చైతన్యానికి, స్వతంత్ర వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలిచారని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ అన్నారు. సరోజినీనాయుడు గొప్ప రచయిత్రి, ఉపన్యాసకురాలు, స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న గొప్ప దార్శనిక నేతల్లో ఆమె ఒకరని కొనియాడారు. సరోజినీనాయుడు జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి రెడ్‌సర్కిల్ వరకూ నిర్వహించిన ఈ ర్యాలీలో కేడెట్‌లు ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. అనంతరం జాతీయ మహిళా దినోత్సవం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రా బాలికల బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నవీన్‌కుమార్ రాయ్, హవల్దార్ అప్పారావు, నాయక్ కుందన్‌కుమార్, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ ఎస్‌కే రఫియాబేగం పాల్గొన్నారు.